



దుర్శేడ్ కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం

రైతు కష్టం.. దళారుల పాలు

- కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం
- కల్లాల వద్దకే కాంటాలతో వస్తున్న వ్యాపారులు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రైతుల కష్టం దళారుల పాలవుతోంది. ఆరుగాలం శ్రమించి వరి ధాన్యం పండించిన రైతులు ఓ వైపు పంటలను రక్షించుకోవడానికి మరో వైపు ఆకాల వర్షం నుంచి కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. ఆకాల వర్షం కారణంగా రైతులు ఈ యాసంగిలో ముందస్తుగా కోతలు నిర్వహించారు. దీంతో కరీంనగర్ మండలంలో పలు కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ధాన్యం కుప్పలు పోసి కాంటాల కోసం ఎదురు చూస్తున్నారు. మరి కొందరు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. వ్యాపారులు నేరుగా రైతుల వద్దకే వచ్చి మద్దతు ధర కంటే తక్కువ కొనుగోలు చేస్తున్నారు. కొందరు కోతలు కోయగానే నేరుగా ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. క్వింటాల్‌కు 1900 రూపాయలకే అమ్ముకుని నష్టపోతున్నారు. పగలంతా నిప్పుల కొలిమిలా ఎండలు కొడుతుంటే రాత్రి వేళ వాతవారణం చల్లబడుతోంది, ఎప్పుడు వర్షం పడుతుందోననే భయం రైతులను వెంటాడుతోంది. కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల చిరుజల్లులు కురవడంతో ఆందోళన చెందారు. ప్రస్తుతం మొగ్దుంపూర్, చెర్లబూత్కూర్, చేగుర్తి, చామనపల్లి, ఇరుకుల్ల, నగునూర్, ఎలబోతారం, గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లోని కేంద్రాలన్ని ధాన్యం కుప్పలతో నిండిపోయాయి. ఆకాల వర్షాల భయంతో పలువురు రైతులు పగలంతా ధాన్యాన్ని అరబెట్టి సాయంత్రం కాగానే టార్పాలిన్లు కప్పుకుంటున్నారు. కరీంనగర్ మండలంలో దుర్శేడ్ సింగిల్ విండో ఆధ్వర్యంలో ఐదు, కరీంనగర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో ఎనిమిది, ఐకేపీ ఆధ్వర్యంలో ఏడు కేంద్రాలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటి వరకు ఆయా కేంద్రాలకు సివిల్ సప్లయిస్ అధికారులు రైస్ మిల్లులు కేటాయించలేదు. దీంతో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంలో నిర్వహకులు జాప్యం చేస్తున్నారు. వెంటనే కొనుగోలు కేద్రాలను ప్రారంభించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

- కాంగ్రెస్ నేతల్లో ఊహాగానాలు
- కరీంనగర్ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ స్థానంలో కొత్త నేత ఎంపికపై చర్చ
- మంత్రి పొన్నం ప్రభాకర్‌తో వైరమే కారణం
- మంత్రిదే తుది నిర్ణయమంటున్న పార్టీ వర్గాలు



ఇన్‌చార్జి మార్పు ఉంటుందా?

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌చార్జిని మార్చుతారని ఆ పార్టీలో ఊహాగానాలు ఊపందుకున్నాయి.ఏ పార్టీకైనా జిల్లా రాజకీయాల్లో జిల్లా కేంద్ర అసెంబ్లీ నియోజక వర్గ రాజకీయాలు, ఆ రాజకీయాలకు నాయకత్వం వహించే నేతలు కీలకంగా ఉంటారు. దీంతో కాంగ్రెస్‌కు జిల్లా అధ్యక్ష పదవి ఎంత ముఖ్యమో కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి అంత ప్రాధాన్యం ఉన్నది. గత ఎన్నికల్లో ఈ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పురమల్ల శ్రీనివాస్ పోటీ చేసి ఓడిపో యారు. ఎమ్మెల్యేలు లేని చోట ఆ పదవికి పోటీ చేసిన వ్యక్తినే నియోజకవర్గ ఇన్‌చార్జిగా భావిం చడం ఆనవాయితీగా వస్తున్నది. పురమల్ల శ్రీని వాస్ తొలుత మంత్రి పొన్నం ప్రభాకర్ అనుచరుడి గానే ఉంటూ వచ్చినా ఆ తర్వాత క్రమంలో కొంత స్వతంత్రంగా వ్యవహరించడం ప్రారంభించారు.

● నామినేటెడ్ పోస్టుల కోసం అనుచరుల పేర్ల ప్రతిపాదన

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వెలిచాల రాజేందర్‌రావు, అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ ఉన్నా వారు ఆ పదవుల్లో నామమాత్రంగా మారిపోయారనే విమర్శలు వచ్చాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ మాటే ఇక్కడ చెల్లుబాటవుతూ వారిద్దరూ ఆయన చెప్పిన దానికి తలూపడం మినహా చేసేదేమి లేని విధంగా మారిపోయారనే భావన పార్టీ వర్గాల్లో ఉంది. ఈ పరిస్థితి నుంచి బయట పడి పురమల్ల నామినేటెడ్ పదవుల విషయంలో తాను కొందరి పేర్లను ప్రతిపాదిస్తూ జాబితాను తయారు చేసి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సమర్పించారు. మరికొన్ని విషయాల్లోనూ ఆయన ఇలాగే వ్యవహరించడం జిల్లా మంత్రి పొన్నంకు అగ్రహం కలిగించారని సమాచారం. డీసీసీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి తాను నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నా తనను ఏమా త్రం సంప్రదించకుండా నిధులు తదితర కేటాయింపులు చేస్తూ మంత్రి పొన్నం

(మిగతా 8వ పేజీలో)

● తెరపైకి పలువురి పేర్లు

కరీంనగర్ నియోజక వర్గ ఇన్‌చార్జి పదవికి పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. పార్లమెంట్ నియోజక వర్గ ఇన్‌చార్జిగా ఉన్న వెలిచాల రాజేందర్‌రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి అంజన్‌కుమార్, ఇటీవల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన వి నరేందర్‌రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. నియోజక వర్గ ఇన్‌చార్జి పదవి ఎవరికి ఇవ్వాలన్నా మంత్రి పొన్నం ప్రభాకర్ మద్దతే కీలకం. ఆయన సూచించిన వారికి మాత్రమే పదవి దక్కే అవకాశం ఉంది. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని ఆ పదవికే అంగీకరించని మంత్రి పొన్నం ఆయనకు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యత ఇచ్చే ప్రసక్తే లేదని అనుకుంటున్నారు. అంజన్‌కుమార్, వి నరేందర్‌రెడ్డి విషయంలోనూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అంత సానుకూల అభిప్రాయం లేదని, రాజేందర్‌రావు పేరును ఆయన అంగీకరించవచ్చని అంటున్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన నియోజకవర్గ ఇన్‌చార్జిని తొలగించి ఓసి సామాజిక వర్గానికి చెందిన రాజేందర్‌రావుకు అవకాశం కల్పిస్తే మంత్రి పొన్నం బీసీ నేతగా అపఖ్యాతిని ఎదుర్కొవాల్సి వస్తుందని పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. మంత్రికి ఈ పదవి మార్పు, కొత్త నేత ఎంపిక సవాలుగానే ఉంటుందనే భావన పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. మరో వైపు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న పురమల్ల శ్రీనివాస్ ఇప్పటి వరకు తాను ఒక ఎపిసోడ్ మాత్రమే చూపించానని, రెండో ఎపిసోడు, మూడో ఎపిసోడు కూడా ఉంటుందని వాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది.

ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని అన్ని మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో కొంత మందికి ఇళ్లు మంజూరు చేశామని, మిగిలిన ఇళ్లను గ్రామాలు, మున్సిపల్ వార్డుల వారీగా మంజూరు చేసేందుకు అలాట్‌మెంట్ జాబితా తయారు చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి పొరపాట్లు జరగొద్దని, వచ్చిన దరఖాస్తుల్లో అత్యంత నిరుపేదలకు మాత్రమే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మంజూరైన ఇళ్లకు మార్కింగ్ పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులతో చర్చించి ఇళ్ల నిర్మాణం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీకిరణ్, ప్రఫుల్ దేశాయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్, జడ్పీ సీఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

● భూభారతిపై ప్రజలకు అవగాహన కల్పించాలి

భూభారతిపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో భూభారతి నూతన రెవెన్యూ చట్టంపై తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం రూపొందించిన భూభారతి చ్టంపై సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల అభిప్రాయాల మేరకు సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టం రూపొందించిందన్నారు. భూ భారతి చట్టంపై సదస్సుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. 17 నుంచి ప్రతి మండలంలో భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాల నిర్వహణకు షెడ్యూల్ రూపొందాని ఆదేశించారు. ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు సలహాలు, సూచనలు ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ పాల్గొన్నారు.

● ఓపెన్ స్కూల్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లాలో ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాస్తున్న వారంతా శ్రద్ధతో చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్, పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనారోగ్యం, వివాహం, కటుంబ పరిస్థితులు వంటి వివిధ కారణాల చేత చాలా మంది పాఠశాల విద్యను మధ్యలోనే ఆపేస్తున్నారని, వారంతా ఓపెన్ స్కూల్‌లో చేరాలని సూచించారు. ఈనెల 20 నుంచి నిర్వహించనున్న ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఫీజు చెల్లించిన విద్యార్థులంతా తప్పక హాజరై పరీక్ష రాయాలని సూచించారు. ఓపెన్ స్కూల్ తరగతులు గ్రంథాలయాల్లో నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని విద్యాధికారులను ఆదేశించారు. డీఈవో జనార్దన్‌రావు మాట్లాడుతూ పదో తరగతిలో 4421 మంది, ఇంటర్‌లో 881 మంది పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, జిల్లా సైన్స్ ఆఫీసర్ జైపాల్ రెడ్డి, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ సీహెచ్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మంచినీటి సరఫరాపై ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ నగర పాలక సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో ఆమె సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని పెండిం గ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, సమస్యలు మంచినీటి సరఫరా వీధి దీపాల నిర్వహణ, బయో గ్యాస్ ప్లాంట్ తదితర అంశాలపై అధికారులతో చర్చిం చారు. పనుల పురోగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసి, టెండర్ ప్రక్రియ చేపట్టాలన్నారు. డ్రైనేజీల్లో సిల్ట్ తొలగింపునకు చర్యలు చేపట్టాలని, వెంటనే డీసిల్టింగ్ ప్రక్రియకు టెండర్లు పిలవాలన్నారు. సమావేశంలో ఈఈలు యాదగిరి, సంజీవ్, డీఈలు లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రకాశ్, ఏఈలు సతీష్, గట్టు స్వామి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

అంగన్‌వాడీల్లో పోషణ సంబరాలు

- సంపూర్ణ ఆరోగ్యం, పరిశుభ్రతే లక్ష్యంగా కార్యాచరణ
- ఈనెల 22 వరకు పోషణ పక్షోత్సవాలు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోంది. ఇంటి వద్ద సమతుల ఆహారం అందించడంపై పేదరికం, కుటుంబ పరిస్థితులు, తదితర కారణాలతో తల్లిదండ్రులు తగిన శ్రద్ధ చూపడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం



గడిపే వారు అధికం. వీరికి పోషకాలపై అవగాహన ఉండడం లేదు. ఈ నేపథ్యంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పోషకాహార లోపాన్ని అధిగమించి సంపూర్ణ ఆరోగ్య సమాజం కోసం ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి పోష ణ పక్షం 2025, పోషణ్ అభియాన్ పేరిట ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. ఈనెల 22 వరకు ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి.


● జిల్లాలో 777 అంగన్‌వాడీ కేంద్రాలు

జిల్లాలో గంగాధర, హుజూరాబాద్, కరీంనగర్‌రూరల్, కరీంనగర్ అర్బన్, నాలుగు ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 777 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో బాలింతలు 4223 మంది, గర్భిణులు 4159 మంది, 7 నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 21,034 మంది. 03-06 ఏళ్ల లోపు చిన్నారులు 26,433 మంది ఉన్నారు. ప్రజల్లో పోషకాహారం, ఆరోగ్యర క్షణ, పరి శుభ్రత వంటి అంశాలపై అవ గాహన కల్పించేందుకు మహిళా శిశు అభివృద్ధి సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యక్రమాలను రూపొందిం చింది. ఐసీడీఎస్, స్వచ్ఛంద సంస్థలు, విద్యాలయాలు, ఆరోగ్యశాఖ, ఆయుష్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, రక్షిత మంచినీటి శాఖ, వివిధ శాఖల భాగస్వామ్యంతో ఈనెల 22 వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు. శిశువు పుట్టినప్పటి నుంచి రెండేళ్ల వయస్సు వరకు వెయ్యి రోజుల ప్రణాళికలో భాగంగా వారి ఆరోగ్యం, సంర క్షణ, తల్లిపాల ప్రాధాన్యం, అనుబంధ పోషకాలపై అవగాహన కల్పిస్తారు.

● విద్యకు ప్రాధాన్యం

పోషణ్ భీ- పడాయి భీ (ఆరోగ్యంతో పాటు విద్య...) సూత్రంతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ దశలో శిశువులకు విద్యపై ఆసక్తి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. తల్లిదండ్రులకు విద్య ప్రాధాన్యం తెలిపి పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేందుకు కృషి చేస్తున్నారు. ఈ మేరకు పక్షత్సవాల్లో అవగాహన కార్య క్రమాలను నిర్వహిస్తున్నారు.

చిన్నారులు, మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం



- సబిత, ఇన్‌చార్జి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి

చిన్నారులు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ నేతృత్వంలో జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 8 నుంచి పోషణ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నాం. జిల్లాలోని 777 అంగన్‌వాడీ కేంద్రాల్లో షెడ్యూల్ ప్రకారం ఈ నెల 22 వరకు పోషణపక్షం కార్యక్రమాల నిర్వహణకు చర్యలు చేపట్టాం.

వైభవంగా అవబృథ చక్రస్నానం

ఇల్లందకుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయంలో అవబృధ చక్రస్నానం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శేషం రామా చార్యులు, శేషం వంశీధరాచార్యులు ఉదయం 11 గంటలకు నిత్యవిధి, నవకలశ స్థాపన, ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అష్టోత్తరశత (108) కలశాభిషేకం, చక్రతీర్థం జరిపించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయ సమీపంలోని కొనేరు వద్దకు తీసుకెళ్లి అవబృధ చక్రస్నానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు, ఈవో కందుల సుధాకర్, ధర్మకర్తలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చకులు

కన్నులపండువగా శ్రీపుష్పయాగం

ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆల యంలో మంగళవారం రాత్రి శ్రీపుష్పయాగం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ దక్షిణ భాగంలో మండపాన్ని అలంకరించి స్వామివారి ఉత్సవమూర్తులను ఉంచారు. ఈ సందర్భంగా భక్తులు పండ్లు, పూలు సీతారామచంద్రమూర్తులకు సమర్పించారు. రాత్రి 11:30గంటలకు శ్రీపుష్పయాగం (నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు వితరణ చేశారు.


స్వామివారికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకుడు


ఉత్సవమూర్తులకు అవబృధ చక్రస్నానం చేస్తున్న అర్చకులు, సిబ్బంది

మహిళ ఆత్మహత్య

కోల్‌సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తన వద్ద ఉండకుండా కూతురు అల్లుడి వద్దకు వెళుతుందనే మనస్తాపంతో గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన ఎండీ సాజిదా(42) మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సాజిదా భర్త గౌస్ ఖాన్‌తో విభేదాలతో తల్లి మలాన్‌బీ వద్ద ఉంటూ కూలి చేసుకుంటూ జీవిస్తోంది. ఆమె కూతురు సానియాకు వివాహం అయింది. రంజాన్ పండుగకు కూతురు సానియా గోదావరిఖనిలోని తల్లివద్దకు వచ్చింది. తిరిగి భర్త వద్దకు వెళ్లేందుకు సిద్ధం అవుతుండగా తల్లి సాజిదా అడ్డుకుంది. తన వద్దే ఉండాలని అల్లుడి వద్దకు వెళ్లవద్దంటూ గొడవ చేసింది. మంగళవారం సానియా అత్తగారింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెంది ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సాజిదా తల్లి మలాన్‌బీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

ట్రాలీని ఢీకొన్న లారీ

-ఒకరికి తీవ్ర గాయాలు

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం ధరూర్ శివారులోని వైన్స్ సమీపంలో ట్రాలీని లారీ ఢీకొనడంతో ట్రాలీ నడుపుతున్న కరీంనగర్‌కు చెందిన నవీన్‌కు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. నవీన్ ట్రాలీ నడుపుకుంటూ కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టి వెళ్లింది.

స్వగ్రామం చేరిన వలసజీవి మృతదేహం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సక్కపేట గ్రామానికి ముత్యం వెంకటేశం గౌడ్(50) అనే వలస జీవి మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరింది. సౌదీ అరేబియాలో గతనెల 13న వెంకటేశం గౌడ్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం గ్రామానికి చేరుకోగా కుటుంబీకుల, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య పద్మ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

కొడిమ్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం ఆరెపల్లి గ్రామ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని తుమ్మ నాగరాజు(21) అనే యువకుడు మృతిచెందాడు. ద్విచక్ర వాహనంపై జగిత్యాల నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న చెర్లబూత్కూర్‌కు చెందిన నాగరాజును గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న శేఖర్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి.

మహిళను దూషించిన వ్యక్తిపై కేసు

మల్యాల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రామన్నపేటకు చెందిన శ్రీరాముల రమేశ్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన తునికి మాధవి అలియాస్ రాజేశ్వరి అనే మహిళను సోమవారం దూషించి, చంపుతానని బెదిరించినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.



విద్యుత్‌తో జాగ్రత్త

- అకాల వర్షాలు, ఈదురుగాలులతో ప్రమాదాలు
- అప్రమత్తతే ఆయుధం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేసవిలో అకాల వర్షాలు, ఈదురుగాలులు ఎక్కువగా సంభవిస్తుంటాయి. దీంతో విద్యుత్ తీగలు తెగిపడడం, స్తంభాలు నేలకొరగడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటాయి. ఇలాంటి సమయంలో తడిసిన స్తంభాలు, సపోర్టింగ్ తీగలను తాకితే విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంది. ప్రధానంగా పొలాల వద్దకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలి. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చు. అకాల వర్షం కురుస్తున్నప్పుడు తడిసిన విద్యుత్ స్తంభాల స్టేవైరు/సపోర్టు తీగలను, స్తంభాలను, విద్యుత్ ఉపకరణాలను తాకరాదు. వేలాడుతున్న, వదులుగా ఉన్న, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను ముట్టుకోవద్దు. గమనించిన వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలి. ఇళ్లలో దుస్తులు ఆరవేసే జీఐ దండాల పైనుంచి విద్యుత్ వైర్లు వెళ్లడంతో విద్యుత్ వాటి ఇన్సులేషన్ దెబ్బతింటుంది. దీంతో దండాలు, పైపులకు విద్యుత్ సరఫరా అవుతుంది. ప్లాస్టిక్ దండాలు ఉపయోగిస్తే ఇలాంటి ప్రమాదాలకు దూరంగా ఉండొచ్చు. విద్యుత్ వైర్లు దండాలు, రేకులకు తగలకుండా జాగ్రత్త వహించాలి. వ్యవసాయ మోటార్లు, ఫుట్ వాల్వులు, సర్వీసు వైర్లకు విద్యుత్ ప్రసారంతో ప్రమాదాలు సంభవిస్తాయి.

ఈ సమయంలో మోటార్లను, పైపులను, ఫుట్ వాల్వులను తాకరాదు. వ్యవసాయ పంపుసెట్లు, స్టార్టర్లకు ఎర్త్ ఏర్పాటు చేయాలి. ఎర్త్ లేని మోటార్లు, స్టార్టర్లు, జీఐ పైపులు, ఫుట్‌వాల్వ్‌లు అత్యంత ప్రమాదకరం. రైతులు, వినియోగదారులు స్వయంగా విద్యుత్ పనులు చేయవద్దు. అర్హులైన ఎలక్ట్రీషియన్‌ను సంప్రదించాలి. మూగజీవాలను మేతకు తీసుకెళ్లినప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల దగ్గరికి వెళ్లకుండా జాగ్రత్త వహించాలి. ఇంటి వైరింగ్‌కు ఎర్తింగ్ చేయించుకోవాలి. ఇళ్లలో నాణ్యమైన విద్యుత్ స్విచ్ బోర్డులు, ఇతర వస్తువులను ఉపయోగించాలి. వ్యవసాయ మోటార్లు, ఇళ్లల్లో అతుకులు లేని సర్వీసు వైరును ఉపయోగించాలి. సెల్ ఫోన్ ఛార్జింగ్ పెట్టి తడి చేతులతో తాకి మాట్లాడడం ప్రమాదకరం. సమీపంలో ఎవరైన విద్యుదాఘాతానికి గురైతే ఆ వ్యక్తిని చేతులతో తాకరాదు. విద్యుత్ ప్రవహించని వస్తువులను (కర్ర, ప్లాస్టిక్ లాంటి) వాడడం సరైన పరిష్కారం. ఇళ్లలో ఐఎస్ఐ మార్క్ ఉన్న స్విచ్ బోర్డులు, ప్లగ్‌లు ఇతర పరికరాలు వాడాలి.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

రమేష్ బాబు, ఎస్ఈ, టీజీ ఎన్‌పీడీసీఎల్

వర్షాలు, ఈదురుగాలుల సమయంలో విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదాలు సంభవిస్తాయి. ప్రధానంగా పొలాల వద్దకు వెళ్లే రైతులు మోటార్లను నేరుగా తాకరాదు. మూగజీవాలు ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లకుండా చూడాలి. ఇళ్లలో ప్లాస్టిక్ దండాలు వాడాలి. గ్రామీణ వినియోగదారులు క్షేత్రస్థాయి సిబ్బంది సేవలను సద్వినియోగం చేసుకోవాలి. విద్యుత్ అంతరాయం ఇతర సమస్యలపై టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫిర్యాదు చేయాలి.



పోలీసులకు సమాచారం అందిస్తున్నాడనే హత్య

- నిందితుల అరెస్టు ● ఆయుధాలు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం

వేములవాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి వ్యాపారానికి సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందిస్తూ తమపై కేసు నమోదు కావడానికి కారణమవుతున్నాడనే కోపంతో ఐదుగురు వ్యక్తులు కలిసి చెట్టిపల్లి పరశురాములు అనే వ్యక్తిని హత్య చేశారని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి తెలిపారు. ఈ నెల 13వ తేదీన వేములవాడ పట్టణంలో పరుశురాములను దారుణంగా హత్య చేసిన ఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం ఆమె వెల్లడించారు. ఈ మేరకు వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కేసులో మృతుడు చెట్టిపల్లి పరుశరాములు, నిందితులు బైరెడ్డి వినయ్, ఈర్ల సాయి, వస్తాద్ అఖిల్, నేదూరి రాజేష్, అడ్డగట్ల మనోజ్ కుమార్ చాలా రోజులుగా స్నేహితులు అని, ఎప్పుడూ వారు కలిసి తిరిగేవారని తెలిపారు. వీరందరిపై వివిధ పోలీస్ స్టేషన్లలో గంజాయి, హత్యతో పాటు పలు రకాల కేసులు నమోదు కావడంతో జైలుకు కూడా వెళ్లి వచ్చారని తెలిపారు. కొద్ది రోజులుగా ఐదుగురు నిందితులపై పోలీస్‌స్టేషన్‌లో గంజాయి కేసులు నమోదు కావడం పోలీసులకు పరుశరాములే సమాచారం ఇస్తున్నాడనే అనుమానంతో హత్యకు కుట్ర పన్నారని, ఇందులో భాగంగా 13వ తేదీ ఆదివారం బైపాస్ రోడ్డులోని మహాలింగేశ్వర గార్డెన్ ఫంక్షన్ హాల్ వద్ద ఉన్నాడని తెలుసుకొని వెంట తెచ్చుకున్న గొడ్డళ్లు, కత్తులతో బైరెడ్డి వినయ్, ఈర్ల సాయి, వస్తాద్ అఖిల్ విచక్షణారహితంగా దాడి చేసి నరికి చంపారని ఆమె తెలిపారు. రాజేష్ అనే వ్యక్తి బయట ఉండి ఎవరూ లోపటికి రాకుండా గేటు వేసి కాపు కాసాడని తెలిపారు. అడ్డగట్ల మనోజ్ కుమార్ మీరందరూ జైలుకు వెళ్తే బెయిల్‌పై తీసుకురావడానికి తాను బయట ఉంటానని చెప్పి హత్యకు ప్రోత్సహించాడని తెలిపారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు వేగవంతంగా విచారించి హత్యకు పాల్పడిన నిందితులు బైరెడ్డి వినయ్, ఈర్ల సాయి, వస్తాద్ అఖిల్, నేదూరి రాజేష్‌లను పట్టుకొని రిమాండ్ తరలించగా మరో వ్యక్తి అడ్డగట్ల మనోజ్ పరారీలో ఉన్నాడని తెలిపారు. హత్యకు ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు రమేష్, వెంకట్రాజం సమావేశంలో పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం

- నాగంపేట యువకుడి మృతి ● మరొకరికి తీవ్రగాయాలు

గంభీరావుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంభీరావుపేట మండలం నాగంపేటకు చెందిన వినోద్(33) మృతిచెందగా, దేవేందర్ అనే మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం దేవేందర్‌ను హైదరాబాద్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గంభీరావుపేట మండలం నాగంపేటకు చెందిన వినోద్ కొంతకాలంగా హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ మధ్యనే నాగంపేటకు వచ్చిన వినోద్ ముంబాయిలో వేరే పనిచూసుకున్నాడు. కామారెడ్డి నుంచి ముంబాయికి ట్రైన్‌కు వెళ్లేందుకు నాగంపేట నుంచి స్నేహితుడు దేవేందర్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. కామారెడ్డి సమీపాన ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంలో వినోద్, దేవేందర్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ముందుగా కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొద్ది సేపటికే వినోద్ మృతిచెందాడు.

దేవేందర్ పరిస్థితి విషమించడంతో చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.



వినోద్ (ఫైల్)

ఇసుక ట్రాక్టర్ బోల్తా : ఒకరి మృతి

కోరుట్ల రూరల్, (ఇబ్రహీంపట్నం) ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం రేగుంట సమీపంలో ఇసుక ట్రాక్టర్ బోల్తా పడి సోమవారం రాత్రి ట్రాక్టర్ యజమాని జక్కం భూమేష్(30) మృతి చెందాడు. ఇబ్రహీపట్నం ఎస్ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం మెట్‌పల్లి పట్టణం గాజులపేటకు చెందిన జక్కం భూమేష్, డ్రైవర్ చింతల సాయిలుతో కలిసి ట్రాక్టర్‌లో ఇసుక లోడుతో ఇబ్రహీపట్నంకు వెళ్తున్న సమయంలో రేగుంట సమీపంలో బోల్తా పడింది. భూమేష్ మృతిచెందగా సాయిలుకు తీవ్ర గాయాలయ్యాయి.



భూమేష్(ఫైల్)

ప్రమాదవశాత్తూ ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధం



హుజూరాబాద్‌లో దగ్ధమైన ఎలక్ట్రిక్ స్కూటర్

హుజూరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం బోర్నపల్లి రోడ్ ఆహల్యనగర్‌లో మంగళవారం ప్రమాదవశాత్తూ ఎలక్ట్రికల్ స్కూటీ దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. గుర్తు తెలియని ఇద్దరు మైనర్ బాలురు ఎలక్ట్రిక్ స్కూటీపై వెళ్తుండగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన వారు స్కూటీని అక్కడే వదిలిపెట్టి పారిపోయారు. ఈ విషయాన్ని స్థానికులు ఫైర్ సిబ్బందికి తెలపగా వారు వచ్చి మంటలను ఆర్పేశారు. కాగా అప్పటికే స్కూటీ పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు అపహరణ

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని కొండూరు కాంప్లెక్స్‌లో గుర్తు తెలియని దుండగుడు ఓ వృద్ధురాలి మెడలో నుంచి మంగళవారం పుస్తెలు తాడు అపహరించాడు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక మండలం కనపర్తి గ్రామానికి చెందిన అల్లపురెడ్డి కమలమ్మ-కొంరారెడ్డి వృద్ధ దంపతులు మంగళవారం జమ్మికుంటలోని ఆసుపత్రికి వచ్చారు. ఆసుపత్రిలో పని పూర్తి అయిన తర్వాత కూరగాయాలు కొనేందుకు కాంప్లెక్స్ మెట్ల వద్ద కూర్చున్నారు. వృద్ధ దంపతులను అనుసరిస్తున్న దుండగుడు తాను ఓ గ్రామ కార్యదర్శిని అని, మీకు రూ.4వేల పెన్షన్ ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఫొటో తీసే సమయంలో మెడలో పుస్తెలు తాడు ఉండకూడదని సూచించడంతో వృద్ధురాలు పుస్తెలు తాడు తీసి ఇచ్చింది. దుండగుడు వృద్ధ దంపతులు కళ్లు కప్పి అక్కడి నుండి నెమ్మదిగా జారుకున్నాడు. బాధితురాలి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

డీఈవో కార్యాలయ భవనం పైనుంచి పడి అటెండర్ మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం(డీఈవో) భవనం రెండో అంతస్థు పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి అటెండర్ కమ్ వాచ్‌మన్ గడప రవీందర్ కుమార్(58) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, మృతుడి భార్య వివరాల ప్రకారం.. కట్టరాంపూర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న రవీందర్‌కుమార్ 28 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాల అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం కట్టరాంపూర్ ప్రైమరీస్కూల్ అటెండర్‌గా పనిచేస్తూ డిప్యుటేషన్‌పై కరీంనగర్ డీఈవో కార్యాలయ అటెండర్ కమ్ వాచ్‌మన్‌గా ఆరు నెలల నుంచి విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో భవనం 2వ అంతస్థుపై ఆరేసిన బట్టలు తీసుకొని కిందకు వస్తున్నాడు. ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. తల, ఛాతీ, చేయికి బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రవీందర్‌కుమార్ భార్య ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సైకిల్‌పై నుంచి పడి ఒకరి మృతి

పెగడపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల కేంద్రంలో మంగళవారం వడ్లూరి మల్లయ్య (59) అనే వ్యక్తి సైకిల్ పై నుంచి పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన మల్లయ్య ఇంటి నుంచి సైకిల్‌పై చెరువు కట్ట వైపు వెళ్తుండగా స్పృహ తప్పి రోడ్డు పక్కన ఆపి ఉన్న ట్రాక్టర్ డబ్బాను ఢీకొట్టాడు. సైకిల్‌పై నుంచి పడడంతో తలకు రాయి తగిలి తీవ్ర రక్తస్రావమై మృతిచెందాడు. ఎండ ప్రభావం తాళలేక సైకిల్‌పై నుంచి పడి చనిపోయాడని మృతుడి కుమారుడు మధూకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వేములవాడ టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన వేములవాడ మండలం అనుపురం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అనుపురం గ్రామానికి చెందిన బండారి శ్రీహరి అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా అనుపురం గ్రామ శివారులో వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో శ్రీహరి (48) అక్కడికక్కడే మృతి చెందాడు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

పాలకుర్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్ఐ ఆర్ స్వామి అన్నారు. మంగళవారం కన్నాల టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు తప్పని సరిగా ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, ప్రమాదకరమన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

మల్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మల్యాలకు చెందిన గడుగు తిరుపతి అనే వ్యక్తిపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గడుగు తిరుపతి మామిడి తోట కౌలుకు తీసుకొని అందులో ఉండగా అదే గ్రామానికి చెందిన బోదాసు శంకర్ మామిడి తోట నుంచి వెళ్తున్నాడు. ఎటు వెళ్తున్నావని శంకర్‌ను తిరుపతి అడిగాడు. ఈ క్రమంలో శంకర్ బండరాయి తట్టుకొని కిందపడిపోయాడు. అనంతరం ఆయన తిరుపతిని దూషించడమే కాకుండా బండరాయితో దాడి చేయడంతో తలకు గాయాలయ్యాయి. తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేయగా శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

చిగురుమామిడి,ఏప్రిల్ 15: మండలంలోని ఇందుర్తి గ్రామానికి చేందిన బుర్ర రవీందర్(50) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సందబోయిన శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రవీందర్ తనుకు ఉన్న కొద్దిపాటి వ్యవసాయానికి అనేక అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాడు. చేసిన అప్పులు పెరిగి పోవడంతో ఇంట్లో తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఇటీవల కొద్ది రోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించగా సాయంత్రం చికిత్స అందించే లోపే మృతి చెందాడు. మృతుడి కుమారుడు బుర్ర ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘాట్‌రోడ్డుపై అదుపు తప్పిన ద్విచక్రవాహనం

- ముగ్గురి గాయాలు

మల్యాల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఘాట్‌రోడ్డుపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి మంగళవారం ముగ్గురికి గాయాలయ్యాయి. రాయికల్ మండలం తాట్లవాయికి చెందిన వినోద్, అతడి భార్య శ్రీవాణి, కూతురు వేదాంశికతో పాటు మరొకరు కొండపై నుంచి ద్విచక్ర వాహనంపై ఘాట్‌రోడ్డు మీదుగా కిందకు వస్తున్నారు. బ్రేకులు పనిచేయక ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోవడంతో వాహనంపై గల వినోద్, శ్రీవాణి, వేదాంశికకు గాయాలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

జమ్మికుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని దుర్గాకాలనీకి చెందిన పురంశెట్టి తిరుపతి (39) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. బయట పని ముగించుకుని వస్తుండగా రైల్వే ఓవర్‌బ్రిడ్జి మీద నుంచి వస్తూ ముందు ఉన్న డీసీఎం వ్యాన్‌ను ఓవర్‌టేక్ చేయబోయి అదుపు తప్పి కింద పడిపోయాడు. డీసీఎం వ్యాన్ వెనుక టైర్ తల మీద నుంచి అక్కడికక్కడే మృతి చెందాడు. చాలా సేపటి వరకు ఎవరూ మృతుడి ఆనవాళ్లు గుర్తించలేకపోయారు. పోలీస్‌లు మృతుడి వద్ద లభించిన ఆధారాలతో దుర్గా కాలనీకి చెందిన నూరంశెట్టి తిరుపతిగా గుర్తించారు. మృతుడికి భార్య సృజన, కుమార్తె, కుమారుడు ఉన్నారు. డీసీఎం వ్యాన్ స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

- అధిక లోడు వల్లే ప్రమాదం?

డీసీఎం వ్యానులో అధిక లోడు ఉండటంతో బ్రిడ్జి డౌన్‌లో సరిగా బ్రేకులు పడవని స్థానికులు చర్చించుకుంటున్నారు. పది టన్నులలోడు వెళ్లాల్సిన వాహనాల్లో 15నుంచి 20టన్నుల వరకు వెళ్తున్నాయని, పట్టించుకోవాల్సిన అధికారులు తనిఖీలతో సరిపెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. అధిక లోడు వాహనాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తిరుపతి(ఫైల్)

సీజ్ చేసిన మద్యం ధ్వంసం

గన్నేరువరం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గత ఎన్నికల కోడ్ సమయంలో పోలీసులకు పట్టుబడిన 480 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని మంగళవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐ తాండ్ర నరేష్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సీఐ బాబా, ఎస్ఐ శ్రీకాంత్‌ల పర్యవేక్షణలో ధ్వంసం చేశారు. సీజ్ చేసిన మద్యం విలువ రూ.86 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.



సీజ్ చేసిన మద్యం బాటిళ్లు

ఇష్టారాజ్యంగా మట్టి తరలింపు

- అనుమతి కన్నా ఎక్కువగా తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు
- ఎల్లమ్మ చెరువులో యథేచ్ఛగా అక్రమ దందా

రామడుగు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం షానగర్ గ్రామంలోని ఎల్లమ్మ చెరువులో మట్టి తరలింపు ఇష్టారాజ్యంగా సాగుతున్నా పట్టించుకునేవారు లేరు. అధికారులు అనుమతించినదానికంటే ఎక్కువగా తవ్వకాలు జరుపుతున్నా అడిగేవారు లేరు. ఇరిగేషన్ శాఖ అధికారులు ఒక వెయ్యి క్యూబిక్ మీటర్లు తరలింపునకు పెద్దపల్లి జిల్లాకు చెందిన ఓ వ్యక్తికి నాలుగు లారీలకు అనుమతించింది. అధికారుల ఉదాసీనతతో కాంట్రాక్టర్ పదుల సంఖ్యలో వాహనాల ద్వారా మట్టిని తరలించడమే కాకుండా విద్యుత్‌శాఖకు చెందిన ఒక ట్రాన్స్‌ఫార్మర్, మూడు విద్యుత్ స్తంభాలను విరగగొట్టి యథేచ్ఛగా మట్టి తరలించినట్లు తెలుస్తోంది. దీనిపై ఫిర్యాదు అందినప్పటికీ కాంట్రాక్టర్‌పై ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

రాత్రింబవళ్లు తవ్వకాలు

రోజుకు ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు మట్టిని రెండు ఎక్స్‌కావేటర్ల సహాయంతో నాలుగు లారీలతో మట్టిని తరలించాలని అధికారులు అనుమతులు ఇచ్చారు. వాటిని తుంగలో తొక్కి రాత్రింబవళ్లు తవ్వకాలు చేపట్టి వందలాది లారీల్లో మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వెయ్యి క్యూబిక్ మీటర్ల మట్టిని మాత్రమే ఆరు రోజులు తీయాల్సి ఉండగా ఇప్పటికే పెద్ద ఎత్తున మట్టి తరలించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రెండు ఎక్స్‌కావేటర్లు పదుల సంఖ్యలో లారీలు నిత్యం నడుస్తున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. పర్మిషన్ ఇచ్చింది గోరంత, తవ్వకాలు కొండంత అన్నట్లు కాంట్రాక్టర్ వ్యవహార శైలి ఉండడం అధికారుల చేతివాటాన్ని చూపిస్తున్నదని గ్రామస్థులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఈ విషయమై సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా గ్రామానికి చెందిన ముగ్గురు రైతులకు మట్టి తరలించడానికి పర్మిషన్ ఇచ్చామని తెలిపారు. రైతులకు ఇచ్చినట్లయితే చెరువులో పదుల సంఖ్యలో లారీలతో ఎందుకు మట్టి తరలిస్తున్నారనే ప్రశ్న తలెత్తుతోంది. దీనిపై ఇరిగేషన్‌శాఖ ఈఈ సుధాకిరణ్‌ను వివరణ కోరగా ప్రస్తుతం తవ్వకాలు ఆపాలని ఎక్కువ మొత్తంలో మట్టి తరలిస్తే ఎంక్వయిరీ చేసి సదరు కాంట్రాక్టర్ నుంచి ఫైన్ వసూలు చేస్తామని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కొని సంబంధిత కాంట్రాక్టర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకొని పర్మిషన్ లేకుండా మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



ఎల్లమ్మ చెరువులో తవ్వకాలు



మట్టి తరలింపు కోసం ఉన్న లారీలు



వారెవ్వా.. తాటిముంజలు

● వేసవి తాపాన్ని తీర్చే ఫలాలు

● పలు ఆరోగ్య ప్రయోజనాలు

మల్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నోరూరించే తాటి ముంజల సీజన్ వచ్చేసింది. ఏప్రిల్, మే నెలల్లో విరివిగా లభించే ఈ తాటి ముంజలను ప్రకృతి ప్రసాదంగా పేర్కొంటారు. వేసవి తాపాన్ని తీర్చడమే కాకుండా శరీర ఉష్ణోగ్రతలను సమతుల్యంగా ఉంచుతూ ఆరోగ్యానికి మేలు చేసే సుగుణాలు తాటి ముంజల ప్రత్యేకత. ఈ తాటిముంజలు కరీంనగర్-జగిత్యాల మార్గంలో గల కొండగట్టులో తాటి వనం అధికంగా ఉండడంతో ఎక్కువగా లభిస్తాయి. 100 రూపాయలకు 10 నుంచి 15వరకు తాటి ముంజలను విక్రయిస్తున్నారు.

పోషక విలువలు అధికం..: తాటి ముంజల్లో అనేక పోషక విలువలు ఉన్నాయి. వేసవిలో మాత్రమే లభించే ఈ తాటి ముంజలను మధుర ఫలంగానూ పేర్కొంటారు. ముంజల్లో 87 శాతం నీరు ఉంటుంది. అందులోని పోషక విలువలు వడదెబ్బ నివారణకు, శరీర ఉష్ణోగ్రతలను తగ్గించడానికి ఉపయోగపడతాయి. తాటి ముంజల లోపటి తెల్లని పదార్థం ఎండ తాపం నుంచి రక్షిస్తుంది. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న ఈ తాటి ముంజలు ప్రతి ఒక్కరూ రుచి చూడాల్సిందే.



తాటి ముంజలు చాలా ఇష్టం...



నీరజ, కరీంనగర్

తాటి ముంజలు అంటే నాకు చాలా ఇష్టం. వేసవి వచ్చిందంటే తప్పకుండా తింటాను. ప్రకృతి సహజ సిద్ధంగా లభిస్తున్న ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో చాలా పోషకాలు లభిస్తాయి. ప్రతి ఒక్కరూ వేసవిలో తాటిముంజలను తీసుకుంటే మంచిది.

ఆరోగ్యానికి మేలు చేస్తాయి



పంజాల శివగౌడ్, గీత కార్మికుడు

తాటి ముంజలు ఎండ నుంచి రక్షిస్తాయి. అంతేగాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వేసవి సీజన్‌లో రెండు నెలల పాటు విక్రయిస్తాం. ప్రత్యేకంగా దూర ప్రాంతాల నుంచి అనేక మంది వచ్చి తీసుకువెళ్తుంటారు.

భారీగా జిల్లా న్యాయమూర్తుల బదిలీలు

రాజన్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పి. నీరజ

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 38మంది జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తుల బదిలీల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పి. నీరజను నియమిస్తూ మంగళవారం రాత్రి హైకోర్టు రిజిస్ట్రార్ ఆఫ్ విజిలెన్స్ ఉత్తర్వులు జారీచేశారు. సిరిసిల్ల జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా మూడేళ్లు విధులు నిర్వహించిన ఎన్. ప్రేమలతను గద్వాల జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేశారు. సిరిసిల్ల పోక్సో అండ్ 1వ అడిషనల్ సెషన్స్ జిల్లా కోర్టు జడ్జిగా పుష్పలతను నియమించారు. అదే విధంగా కరీంనగర్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎస్. శివకుమార్, పెద్దపల్లి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కె. సునిత, జగిత్యాల జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా రత్నపద్మావతిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. జగిత్యాలలో పనిచేసిన పి. నీలిమ మెదక్‌కు, కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన ప్రతిమను జనగామ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేశారు. కరీంనగర్ ఏసీబీ జిల్లా కోర్టు జడ్జిగా జె. విక్రమ్, కరీంనగర్ జిల్లా ఫ్యామిలీ కోర్టు అండ్ 4వ అడిషనల్ సెషన్స్ జిల్లా జడ్జిగా జె. కవితను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అగ్నివీర్ దరఖాస్తు గడువు 25 వరకు పొడిగింపు

జగిత్యాల అగ్రికల్చర్, పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్నివీర్ దరఖాస్తు గడువును ఈనెల 25 వరకు పొడిగించినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి బి.సత్తెమ్మ, పెద్దపల్లి ఉపాధి కల్పన అధికారి తిరుపతిరావు తెలిపారు. ఇండియన్ ఆర్మీలో వివిధ కేటగిరీల వారీగా అగ్నివీర్‌లో జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్, స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్‌కు 10వ తరగతి పాస్ మరియు అగ్నివీర్ ట్రేడ్స్ మెన్ (8వ తరగతి పాస్) ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు వారి అర్హత ఆధారంగా ఏవైనా రెండు కేట గిరీలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అదే విధంగా ఐటీఐ, డిప్లమా, ఎన్‌సీసీ అర్హత పొందిన అభ్యర్థులకు బోనస్ మార్కులుంటాయని పేర్కొన్నారు. 13 భాషల్లో కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఆన్‌లైన్ విధానంలో ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సికింద్రాబాద్‌లోని రిక్రూటింగ్ కార్యాలయం ఫోన్ నంబర్ 040-27740205లో సంప్రదించవచ్చన్నారు. ఔత్సాహిక అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీక్షా సమావేశం

భగత్‌నగర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కరీంనగర్ జోన్ పరిధిలోని రీజినల్ మేనేజర్‌లు, డిప్యూటీ రీజినల్ మేనేజర్‌లు, అధికారులతో సంస్థ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రీజియన్లు, ఎలక్ట్రిక్ బస్సుల పనితీరుపైనా చర్చించారు. ఈ నెలలో అధిక పెళ్లి మూహుర్తాలు ఉన్నందున ప్రయాణికులకు సరిపడా బస్సులను అందుబాటులో ఉంచాలన్నారు. వేసవి దృష్ట్యా అన్ని బస్ స్టేషన్‌లలో తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్‌లు, అకౌంట్స్ ఆఫీసర్లు, పర్సనల్ ఆఫీసర్లు, డిప్యూటీ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వర్క్స్ మేనేజర్, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్లు పాల్గొన్నారు.

19న ఉమ్మడి జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న కొత్తపల్లిలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ జట్టు, సౌత్ జోన్ సీనియర్స్ మహిళల, పురుషుల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు జనన ధ్రువీకరణపత్రం, ఒరిజినల్ ఆధార్‌కార్డుతో మధ్యాహ్నం 3 గంటలకు సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రభాకర్, పీఈటీ శ్రీధర్‌కు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9441925807, 8978995730 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వం నూతన అధ్యాయం

మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వం నూతన అధ్యాయం ప్రారంభించిందని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాలలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉగాదిని పురస్కరించుకొని సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. సన్నబియ్యం పంపిణీతో దళారి వ్యవస్థ కనుమరుగై పోయిందన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని భూ భారతి కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారన్నారు.

గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో భూయాజమాన్య హక్కులు హరించబడ్డాయని ఆయన ఆరోపించారు. భూముల వివరాలు ఎవరైనా ఆన్‌లైన్‌లో చూసుకునేలా భూ భారతి చట్టం రూపొందించడం జరిగిందన్నారు. పారదర్శకతను పెంపొందించడానికి కాంగ్రెస్ సర్కారు ప్రయత్నం చేస్తోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఆయన విమర్శించారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునః ప్రారంభించడంతో సమస్యలకు పరిష్కారానికి నూతన అధ్యాయం మొదలైనట్లయిందన్నారు. కాంగ్రెస్ సర్కారు ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఏకగ్రీవ తీర్మానం చేశాయన్నారు. ప్రధాని నరేంద్రమోదీ బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి అమలు చేయాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

సీనియారిటీకి తగ్గట్టు గౌరవం లేక అసంతృప్తి

"కాంగ్రెస్‌లో నా స్థానం ఏమిటి..నా సీనియారిటీ ఏమిటి.. రాష్ట్రంలో కాంగ్రెస్‌లో మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హన్మంత్‌రావు (వీహెచ్) తర్వాత నేనే సీనియర్‌ను.. జానారెడ్డి కూడా నా తదుపరి నాలుగు సంవత్సరాలకు కాంగ్రెస్ సభ్యత్వం తీసుకున్నారు..నా సీనియారిటీకి తగ్గట్టుగా గౌరవాన్ని పొందలేని పరిస్థితుల్లో అసంతృప్తితో ఉన్నా" అని జీవన్‌రెడ్డి అన్నారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఎలాంటి పోరాటం చేశారో, శాసనసభా పక్ష నాయకుడిగా భట్టి విక్రమార్క ఎలాంటి పోరాటం చేశారో, శాసన మండలి నాయకుడిగా అదే స్థాయిలో తాను పోరాటం చేశానని జీవన్‌రెడ్డి తెలిపారు. శాసనమండలిలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ఒంటరి పోరాటం చేశానన్నారు.

నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌లో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్నానన్నారు. జగిత్యాలలో కాంగ్రెస్ అంటేనే జీవన్‌రెడ్డి... జీవన్‌రెడ్డి అంటేనే కాంగ్రెస్ అన్న విధంగా పనిచేశానని ఆయన గుర్తు చేశారు. ఏదైనా అంశాల పట్ల భిన్నాభిప్రాయాలు కలిగి ఉండవచ్చని, అంతమాత్రాన పార్టీ వీడుతారని అనడం సబబు కాదన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు ప్రేమ్‌సాగర్‌రావు, రాజ్‌గోపాల్‌రెడ్డిలు వారికి ఉన్న పరిస్థితుల్లో పదవులు ఆశించడం తప్పుగా భావించొద్దని జీవన్‌రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, కాంగ్రెస్ నాయకులు కొత్త మోహన్, గాజుల రాజేందర్, చాంద్‌పాషా, పిప్పరి అనిత, మహిపాల్, రఘు, రమేశ్, శీలం నరేశ్, గుండ మధు తదితరులు పాల్గొన్నారు.

కష్టాలను కడతేర్చు బద్దిపోచమ్మ తల్లీ..

బోనం మొక్కులు చెల్లించుకున్న భక్తులు



బద్దిపోచమ్మ దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు



వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కష్టాలను కడతేర్చి.. మమ్మల్ని చల్లగా చూడు బద్దిపోచమ్మ తల్లీ.. అంటూ భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారికి భక్తులు తెల్ల వారు జామునే మట్టి పాత్రలో నైవేద్యాన్ని వండుకొని డప్పుచప్పుళ్ల మధ్య నెత్తిన బోనాలతో శివసత్తుల నృత్యాలతో బైండ్ల వాళ్ల ఆటలతో ఊరేగింపుగా ఆలయానికి తరలి వచ్చారు. సుమారు రెండు గంటల పాటు క్యూలైన్‌లో నిరీక్షించిన భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని బైండ్ల పూజారులతో పట్నాలను వేశారు. అనంతరం నూతవస్త్రాలను పెటి అమ్మవారికి ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఏఈవో లు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, అశోక్‌కుమార్‌లు, సూపరింటెండెంట్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. సోమవారం వేములవాడ రాజన్నను దర్శించుకున్న భక్తులు ఆ రాత్రి కే కొండపైకి చేరుకొని అంజన్న దీక్షపరులు వేకువజామునే స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

నీరుకుళ్ల రంగనాయక స్వామి ఆలయంలో వైభవంగా శకటోత్సవం

రేపు రథోత్సవం



శకటోత్సవంలో పాల్గొన్న భక్తులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని నీరుకుళ్ల రంగనాయకుల స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి వాహన సేవలకు సంబంధించిన శకటోత్సవం జరిగింది. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా వివిధ వాహనాలలో స్వామి వారిని ఊరేగించారు. ఆలయానికి సంబంధించిన వాహనాలతో పాటు నీరుకుళ్ల, వేగురుపల్లి గ్రామస్థులు ప్రత్యేకంగా తయారు చేసుకుని వచ్చిన ఏనుగు వాహనం పై స్వామి వారిని ఊరేగించారు. ఆనంతరం ఆలయం ఆవరణలో డోపు కథ వివరించారు. ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధనగిరి మనోహరాచార్యులు, రాజ్‌కుమారాచార్యులు డోపు కథను వివరించారు.

● **డోపు కథ విశిష్టత:** తిరుమంగళయ్యార్ అనే భాగవతోత్తముడు నిత్య అన్నదాన కైంకర్యం చేస్తుంటాడు. నిత్యం చేయడం వలన అతని వద్ద ఉన్న ద్రవ్యం ఖాళీ అవుతుంది. తిరుమంగళయ్యార్ దారి దోపిడీ చేసి అన్నదానం కొనసాగిస్తాడు. ఒక రోజు దారి దోపిడీ చేస్తున్న సందర్భంలో శ్రీరంగ నాథుడే సపరివార సమేతంగా పెళ్లి వారి వేషధారణలో వస్తుండగా ఆ బృందాన్ని దోపిడి చేస్తాడు. స్వామి కాలివేలికి ఉన్న బంగారు ఉంగరాన్ని ఇవ్వమని అడుగుతాడు. అన్ని ఆభరణాలు నువ్వే లాక్కున్నావు, దాన్ని కూడా లాక్కో అంటారు స్వామి.

ఎంతకూ ఆ ఉంగరం రాదు. ఏమైనా మంత్రం వేశావా.. నాకు కూడా చెప్పవా అంటూ స్వామి వారిని తిరుమంగళయ్యార్ అడుగుతారు. అపుడు స్వామి అతడి చెవిలో నారాయణ అష్టాక్షరీ మంత్రం ఉపదేశించి కళ్లు తెరువు అంటారు. తిరుమంగళయ్యార్‌కు రంగనాధ స్వామి దివ్యమైన మంగళ స్వరూపాన్ని చూపిస్తాడు. ప్రతీ వైష్ణవాలయంలో రథోత్సవం కన్నా ముందు రోజు డోపు కథ వివరిస్తారు. కథ విన్న వారికి అష్ట ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని నమ్మకం.

నిలిపి ఉన్న వాహనాన్ని ఢీకొట్టిన కారు

వేములవాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నిలిపి ఉన్న వాహనాన్ని అటవీశాఖ అధికారుల కారు ఢీకొట్టిన సంఘటన మంగళవారం వేములవాడలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వేములవాడ పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు అల్లాడి రమేష్ స్థానిక వాసుదేవా టవర్స్‌లోని స్టేట్ బ్యాంక్‌కు పని నిమిత్తం వెళ్లి తన ఇన్నోవా వాహనాన్ని బ్యాంకు ఎదుట పార్కు చేసి లోపలికి వెళ్లారు. అదే సమయంలో అటవీ శాఖ అధికారులు ప్రయాణిస్తున్న కారు వేగంగా వచ్చి పార్కు చేసి ఉన్న ఇన్నోవా వాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో కారు నడిపిస్తున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌తో పాటు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గాయపడంతో వారిని 108 వాహనంలో వేములవాడ ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

ధాన్యం ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ప్రమాదం

మానకొండూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం గ్రామంలో మంగళవారం ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. వరి ధాన్యం రైసుమిల్లులో విక్రయించేందుకు రైతు ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్నాడు. అన్నారంలోని లోలెవల్ బ్రిడ్జి వద్ద రోడ్డు గుంతలమయంగా మారడంతో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరుగలేదు.

లోలెవ్ బ్రిడ్జి వద్ద రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో పలుమార్లు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కళాకారులకు దేవాలయాల్లో ఉద్యోగాలు ఇవ్వాలి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దుబ్బుల కొలుపు కళాకారులకు దేవాలయాల్లో ఉద్యోగావకాశాలు కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జునగరి దుర్గయ్య కోరారు. మంగళవారం నగరంలో రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. దుబ్బుల కొలుపు కళాకారులను సాంస్కృతిక శాఖలో గుర్తింపు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారంలో అవ కాశం కల్పించాలని కోరారు. వృద్ధ కళాకారులకు పింఛన్ ఇవ్వాలని, ఇళ్లు లేని వారికి పక్కా ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఉచిత హెల్త్‌కార్డులు ఇవ్వాలని అన్నారు. ప్రతీ కొలుపు కళాకారుడికి వృత్తి గత పూచీకత్తుపై లక్ష రూపాయల రుణం ఇవ్వాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు జునగరి లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిరి శ్రీకాంత్, గౌరవ సలహాదారుడు లెల్లెల బాలకృష్ణ పాల్గొన్నారు.

ధర్మపురి బోయవాడలో చోరీ

బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరణ

ధర్మపురి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని బోయవాడలో చోరీ జరిగింది. బోయవాడకు చెందిన గడప రమేష్ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి రూ.80 వేల నగదు, 7 తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు అపహరించుకవెళ్లారు, వచ్చిన వ్యక్తులు ఇంటిలో ఒక పెట్టెలో దాచి ఉన్న నగదు, బంగారు, వెండి ఆభరణాలు అపహరించారు. పెట్టె తెరచి ఉండటంతో దొంగతనం జరిగినట్లు రమేష్ మంగళవారం గుర్తించాడు. వచ్చిన వ్యక్తులు రమేష్ ఇంటిని నాశనం చేస్తామని అక్కడే ఒక లేఖను వదిలి వెళ్లి పరారయ్యారు. ఎస్ఐ ఉదయ్‌కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కాగా చోరీ ఎప్పుడు జరిగిందో తెలియ రావడం లేదు.

రూ.7,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,600 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు ఐదుగురు రైతులు 75క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు ఆరు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,600, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంచం పట్టిన విద్యార్థులు

● 30 మందికి జ్వరం ● కోరుట్ల ఆసుపత్రిలో 14 మందికి చికిత్స

కోరుట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 30 మంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారు. మంగళవారం



జ్వరంతో బాధపడుతున్న విద్యార్థులకు మందులను అందజేసిన వైద్య సిబ్బంది

ఉదయం జ్వరంతో బాధపడుతున్న 14 మంది విద్యార్థులను కోరుట్ల పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌కు వైద్య పరీక్షలకు తీసుకువచ్చారు. వారిలో ఒక విద్యార్థి తీవ్ర జ్వరంతో బాధపడగా వైద్య సిబ్బంది అప్రమత్తమై విద్యార్థులను కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని విద్యార్థుల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం గురుకుల పాఠశాలలో ఆయన ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. 30 మంది విద్యార్థులకు జ్వరం ఉన్నట్లు గుర్తించి వారికి వైద్యం అందించారు. విద్యార్థుల రక్త నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం టీ హబ్‌లోని ల్యాబ్‌కు తరలించారు.

కాగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులతో పాటు పాఠశాలలో జ్వరంలో బాధపడుతున్న వారిని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావులు వేర్వేరుగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పులతో విద్యార్థులకు జ్వరం వచ్చినట్లు తెలిపారు. విద్యార్థులకు జ్వరం తగ్గడంతో సాయంత్రం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. గురుకులంలో వైద్య శిబిరం కొనసాగిస్తున్నారు. విద్యార్థులు జ్వరంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న పలువురు తల్లిదండ్రులు వారిని ఇంటికి తీసుకెళ్లారు.



కోరుట్ల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

● న్యూస్‌బాక్స్

యూ డైస్‌పై శిక్షణ

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): యూ డైస్ ప్లేస్ 2024-25 స్కూల్ రిపోర్ట్ కార్డ్స్‌లో భాగంగా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ కరీంనగర్‌లో చాత్రోపాధ్యాయులకు స్కూల్ లెవల్ యూడైస్ ఫిజికల్ వెరిఫికేషన్ కోసం మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మొండయ్య, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్లానింగ్ కో-ఆర్డినేటర్లు మిల్కూరి శ్రీనివాస్, చేకూరి మల్లేశం, శ్రీధర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సూయి జనరిస్ 2025 విజయోత్సవ సమావేశం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం సూయి జనరిస్ 2025 విజయోత్సవ సమావేశం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యలో నూతనత్వం కోరుతూ ముందుకు సాగుతున్న ప్రయత్నంలో సూయి జనరిస్ 2025 ఒక గొప్ప ఉదాహరణ అన్నారు. అకడమిక్ కోఆర్డినేటర్ బి.సంపత్ కుమార్, కన్వీనర్ డాక్టర్ ఆర్. కిరణ్ కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్, రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

33కేవీ, 11కేవీ ఫీడర్లపై ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరా వ్యవస్థలో 33కేవీ, 11కేవీ లైన్లలో ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్లు (ఎఫ్‌పీఎల్ఎస్) ఏర్పాటు చేస్తున్నట్లు కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ రమేష్‌బాబు ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లలో అంతరాయాలు గుర్తింపు, నివారణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఇండికేటర్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలోని 52 విద్యుత్ ఫీడర్లలో ఎఫ్‌పీఐలను బిగించడానికి ప్రదేశాలను గుర్తించామని పేర్కొన్నారు. బ్రేక్ డౌన్ సమయంలో, ప్రకృతి వైపరీత్యాలు, సాంకేతిక కారణాలతో లైన్ మొత్తం తనిఖీ చేసే అవసరం లేకుండా, విద్యుత్ అంతరాయం కలిగిన భాగాన్ని విభజిస్తుందని తెలిపారు.

పోలీస్ సైరన్‌తో తిరుగుతున్న కారు సీజ్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అంబేద్కర్ స్టేడియం వద్ద కారులో అదేపనిగా పోలీస్ సైరన్ రావడంతో స్థానికులు ఒకటో థాణా పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. గణేష్ నగర్‌లోని బాబురావుకు చెందిన కారుగా నిర్ధారించి సీజ్ చేశారు. కారు(టీఎస్ 02 ఈవై 5598) యజమానిపై ఎంవీ యాక్టు కింద కేసు నమోదు చేసి ఆర్టీఏకు సిఫారసు చేశామని సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



యాత్రలో పాల్గొన్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్/కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కరీంనగర్ మండలం దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామాల్లో కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రాజ్యాంగాన్ని కాపాడు కోవాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు సాయిని తిరుపతి, మండల అధ్యక్షుడు రాంరెడ్డి, దుర్శేడ్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర హరీష్, తిరుపతి, ముత్యం శంకర్ , పాలకుర్తి లక్ష్మణ్, కాశిపాక మురళీ కృష్ణ, పెంట శేఖర్, పర్వతం మల్లేశం హరీష్, రవీందర్ పాల్గొన్నారు.

ప్రజలను జాగృతం చేసేందుకు దేశ వ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చేపట్టినట్లు సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చేపట్టారు. మొదట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్న కొన్ని శక్తుల కుట్రలను వ్యతి రేకిస్తూ, అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా కేంద్రహోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ, మహాత్మా గాంధీ గొప్పత నాన్ని వివరిస్తూ యాత్ర చేస్తున్నామన్నారు. కరీంనగర్ నియోజకవర్గ కోఆర్డి నేటర్ నమిండ్ల శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు నడిపెల్లి అశోక్‌రావు, భూమాగౌడ్, ప్రసాద్, చంద్రశేఖర్, పిట్టల శ్రీనివాస్, ప్రసాద్‌గౌడ్, నర్సయ్య, చంద్రిక, మీరజ్, గంట శ్రీనివాస్, అష్రఫ్, దేవేందర్, శ్రీనివాస్, అంజ నేయులు, సాయిరాం, అలీం, మసుమ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి మార్పు ఉంటుందా?

(5వ పేజీ తరువాయి)

ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శిం చారు. పర్యటన విషయాలు తనకు సమాచారం ఇవ్వడం లేదని, ఇసుక కాంట్రాక్టులు, పార్కు నిర్వహణ కాంట్రాక్టు తనకు కావాల్సిన వారికి ఇప్పించుకున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారం పార్టీలో తీవ్ర కలకలానికి దారితీసింది. ఈ వ్యవహారంపై కొందరు నియోజకవర్గ నాయకులు టీపీసీసీకి ఫిర్యాదు చేశారు. టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ పురమల్ల శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేసింది. ఆయన దానికి ఏ జవాబు ఇచ్చారో.. పార్టీ ఏమి ఆలోచించిందో.. కాని ఆ వ్యవహారంపై ఆ తర్వాత ఏలాంటి ప్రకటన వెలువడలేదు. అది అక్కడికి సద్దుమణిగినా పురమల్ల శ్రీనివాస్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవి నుంచి తొలగిస్తారని ప్రచారం ప్రారంభమైంది. కొద్ది రోజులుగా ఈ ప్రచారం ఊపందుకుంది.

పన్ను చెల్లించి ట్రేడ్ లైసెన్స్‌లు పొందాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రెన్యువల్ చేసుకున్న వారు పన్ను చెల్లించి ట్రేడ్ లైసెన్స్‌లు పొందాలని నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి అన్నారు. కరీంనగర్ సమావేశ మందిరంలో ఆర్వో ఆర్ఐ వార్డు అధికారులు, జవానులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్తిపన్నులో 5 శాతం రిబేట్ ట్రేడ్ లైసెన్స్ జారీ, కలెక్షన్ తదితర అంశాలపై చర్చించారు. ట్రేడ్ పన్ను చెరల్లించక పోయినా, లైసెన్స్ పొందక పోయినా చట్ట ప్రకారం ఆ షాపులను మూసి వేస్తామన్నారు. సమావేశంలో ఆర్వో భూమానందం, ఆర్ఐ ఖలిముల్లాఖాన్, వార్డు ఆఫీసర్లు, జవానులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21, 22 తేదీల్లో శంషాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంషాబాద్‌లో నిర్వహించనున్న యూనియన్ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిట్టల సమ్మయ్య, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, కన్నం సదానందం, అనిశెట్టి చంద్రయ్య, జంగం కొమురయ్య, పూదరి ఓదయ్య, ఖాపాషా, గోదారి లక్ష్మణ్, గడ్డి ఐలయ్య, గుండవేని ప్రవీణ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద కార్యక్రమం పూర్తి

భగత్‌నగర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మైత్రీ గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న అన్నప్రసాదం కార్యక్రమం మంగళవారం పూర్తయ్యింది. కొత్తపల్లిలోని జయపాల్‌రెడ్డి ఫామ్ హౌస్‌లో నిర్వహించిన భిక్షకు కొత్త జయపాల్‌రెడ్డి, డి.సంపత్ దాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో గువ్వ మనోజ్‌కుమార్, విజయ్‌గౌడ్, నరేష్, గడప నాగరాజు, రుద్రాక్షకృష్ణ, రాఖీ, ఎల్కపల్లి కొంరయ్య, శ్రీనివాస్, శివకుమార్, జాతరకొండ శ్రీనివాస్, సందె అశోక్, ప్రవీణ్, గొల్ల రవి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చరిత్రాత్మక ఘట్టం

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చరిత్రాత్మక ఘట్టమని, ముఖ్యమంత్రి పట్టుదలతోనే ఇది సాధ్యమైందని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీవర్గీకరణ బిల్లు తెచ్చి దేశంలోనే తెలంగాణ రాష్ట్రం రికార్డు సృష్టించిందని తెలిపారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్ విజన్‌ను నిజం చేసిందని పేర్కొన్నారు. బిల్లు తీసుకొచ్చిన సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సన్న బియ్యం పంపిణీపై హర్షం

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి పొన్నం మధు అన్నారు. 36వ డివిజన్‌లో రేషన్ డీలర్లను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పథకాలతో ముందు కెళ్తోందన్నారు. సన్న బియ్యం పంపిణీ చేస్తూ ముఖ్యమంత్రి రాష్ట్రంలో పేదల కడుపునింపిని తీర్చారన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

భగత్‌నగర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని జిల్లా కార్యాలయంలో పార్టీ సంస్థాగత నిర్మాణంపై అసెంబ్లీ కన్వీనర్లు, మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ఆదాయ మార్గాలు లేక భూములు అమ్ముకునే స్థితికి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. హైదరాబాద్‌లో హెచ్‌సీయూ భూములు వేలం వేసి కాలం వెళ్లదీసేందుకు ప్రభుత్వం తాత్కాలిక ఆలోచన చేస్తున్నదన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మడ వెంకట్‌రెడ్డి పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరాచారి, సంపత్ రావు, నిర్మలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలు-నివారణ చర్యలపై కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రజలకు కరీంనగర్ ఫైర్ స్టేషన్ అధికారులు అవగాన కల్పించారు. అగ్నిమాపకశాఖ వారోత్సవాలలో భాగంగా మంగళవారం కరీంనగర్ ఫైర్ స్టేషన్ అధికారులు కరపత్రాలు. పోస్టర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన రక్షణ చర్యలు, ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కరీంనగర్ ఫైర్ స్టేషన్ ఆడింగ్ ఫైర్‌మెన్ బి.మహేందర్, ఫైర్‌మెన్ శ్రీనివాస్, ఎం.రాజ్‌కుమార్, బి.మారుతి, ఎస్ ఓవైజ్, ఎం.రఘువర్ధన్, పి.శ్రీనివాస్, కె.భిక్షపతి, ఎం.బుచ్చయ్య, ఆర్టీసీ అధికారులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్, టూ ఏడీఈలు శ్రీనివాస్ గౌడ్, లావణ్య తెలిపారు. ఉదయం 8:30 నుంచి 10:30 వరకు శక్తి ఆలయం, బాలాజీ సూపర్ మార్కెట్, సంతోష్ నగర్, సంతోష్ మాతా దేవాలయం, ఉదయం 9 గంటల నుంచి 10 వరకు భగత్‌నగర్, వాసుదేవ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, విఘ్నేశ్వరకాలనీ, అయోధ్య కాలనీ, ఉదయం 8:30 నుంచి 10:30 వరకు మహాలక్ష్మి నగర్, శ్రీనివాస్ నగర్, జయశంకర్ కాలనీ, శాతవాహన ఫార్మా మెడికల్ కాలేజ్, చర్చి ఏరియా, అంబేద్కర్ నగర్, శివాజీ నగర్, కిసాన్ నగర్, ఎస్‌టీ కాలనీ, ఉదయం 8 గంటల నుంచి 10 వరకు కోతిరాంపూర్, లక్ష్మీనగర్, ఉదయం 7 గంటల నుంచి 10 వరకు మెహర్‌నగర్, వింద్యావళి పాఠశాల, డీ మార్ట్ ప్రాంతం ఎదురుగా ఈఎన్ గార్డెన్, గౌడ హాస్టల్ ఏరియాల్లో, ఉదయం 8:30 నుంచి 10:30 వరకు రాంనగర్, శివనగర్, ప్రగతినగర్, మార్కండేయ నగర్, సప్తగిరి కాలనీలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సుభాష్‌నగర్‌లోని 22వ డివిజన్‌లో 20 లక్షల సుడా నిధులతో నిర్మించే డ్రైనేజీ పనులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ విగ్రహం నుంచి ఆరెపల్లి వెళ్లే ప్రధాన రహదారి పక్కన 30 సంవత్సరాల క్రితం నిర్మించిన డ్రైనేజీ ధ్వంసమైందని మాజీ కార్పొరేటర్ గంట కళ్యాణి శ్రీనివాస్, స్థానిక నాయకులు దండి రవీందర్, ముల్కల కవిత తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. సమస్య పరిష్కారానికి రూ.20 లక్షల సుడా నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ నాయక్, ఈఈ రొడ్డ యాదగిరి, ఏసీపీ వేణు గోపాల్, టీపీఎస్ సంధ్య, కాంట్రాక్టర్ పంజాల వెంకన్న, పులి సుమన్, గౌస్ ఖాన్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



తనిఖీలో పాల్గొన్న ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం కరీంనగర్-జగిత్యాల రహదారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాంగ్‌రూట్‌లో వెళ్తున్న 33 మంది వాహనదారులకు జరిమానా విధించారు. అనంతరం ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రహదారి భద్రతను బలోపేతం చేసేందుకే ప్రత్యేక తనిఖీలు చేపట్టామన్నారు. ప్రజలు, వాహన దారులకు ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వాహన దారులు ట్రాఫిక్ నియమాలు పాటిం చాలన్నారు. ట్రాఫిక్ సీఐ పర్శ రమేష్, ఎస్సై ప్రమోద్‌రెడ్డి, ఆర్ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

హుజూరాబాద్ హాకీ క్లబ్ కమిటీ ఎన్నిక

హుజూరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో హాకీ క్లబ్ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోట రాజేంద్రప్రసాద్, సెక్రెటరీగా బొడిగ తిరుపతి, ఉపాధ్యక్షులుగా భూసారపు శంకర్, ఆరేలి రమేష్, వేముల రవికుమార్, యూసుఫ్, జాయింట్ సెక్రెటరీగా శ్యాం సుందర్, రాజు, ప్రదీప్, సాయికృష్ణ, ట్రెజరరీగా రాజేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా రాజేష్, విక్రమ్, భాస్కర్‌రెడ్డి, వినయ్, సాంబరాజు, కోచ్‌గా విక్రమ్, సలహాదారులుగా సమ్మయ్య, పవన్‌కుమార్, రఘు, శ్రీనివాస్, భిక్షపతి, జాని, బాలరాజు, కార్యవర్గ సభ్యులుగా పరబ్రహ్మం, సన్ని, వినీత్, విపుల్, రోహన్, రాజకుమార్, వంశీ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కె.శ్రీనివాస్, బి.శ్రీనివాస్, సమ్మయ్య, సజ్జు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో రైతులకు మేలు



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్

సైదాపూర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం రైతులకు మేలు చేస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్ అన్నారు. మంగళవారం సైదాపూర్ మండలంలో ఐకేపీ ద్వారా నిర్వహించే ఆకునూర్, ఘన్‌పూర్, రాయికల్ గ్రామాల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.మార్కెట్ వైస్ చైర్మన్ రాజ్‌కుమార్, ఏపీఎం కుమారస్వామి, మంత్రి పీఏ మల్లేశం పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ క్షమాపణ చెప్పాలి

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ జయంతిని నామమాత్రంగా నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ మహమద్ ఆయాజ్ క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆరగంటలోనే అంబేద్కర్ జయంతి వేడుకలు ముగించడం బాధాకరమన్నారు. సమావేశంలో మల్లేష్, శీలం శ్రీనివాస్, ఆకుల రాజేందర్, కొలగాని రాజు, పల్లపు రవి, గణేష్, స్వామి పాల్గొన్నారు.

టీజేఎస్ జిల్లా కన్వీనర్‌గా మోరె గణేష్

శంకరపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన మోరె గణేష్‌ను తెలంగాణ జన సమితి జిల్లా కన్వీనర్‌గా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ నియామకానికి సహకరించిన టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి అరికిల్ల స్రవంతికి కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసుల తనిఖీలు

శంకరపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ శివారులోని సీడ్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్ల క్వార్టర్స్‌ను పోలీసులు మంగళవారం తనిఖీ చేశారు. సీడ్ ప్లాంట్లలో ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలు పనిచేస్తున్నారు. హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్‌గౌడ్, కేశవపట్నం ఎస్ఐ రవి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



మానకొండూర్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న రసమయి

హుజూరాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మంగళవారం హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

సభను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్: వరంగల్ జిల్లాలో జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మానకొండూర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉండి దేశంలోనే తెలంగాణను అన్ని రంగాలలో అభివృద్ధి చేశామన్నారు. మాజీ జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచులు రామంచ గోపాల్‌రెడ్డి, ఎరుకల శ్రీనివాస్, బోడ రాజశేఖర్ పాల్గొన్నారు.

● శంకరపట్నం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మంగళవారం శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామంలోని మాధవసాయి గార్డెన్‌లో ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గంట మహిపాల్, మాజీ జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పొద్దుటూరి సంజీవరెడ్డి, పల్లె సంజీవరెడ్డి, చౌడమల్ల వీరస్వామి పాల్గొన్నారు.

● గంగాధర : బీఆర్ఎస్ రజతోత్సవ వరంగల్ సభకు తరలిరావాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం గంగాధర మండలం బూరుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నివాసంలో మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు నవీన్‌రావు, తాజా మాజీ సర్పంచ్‌లు కంకణాల విజేందర్‌రెడ్డి, దామోదర్, మహిపాల్ రావు ఉన్నారు.

నీటి వృథాను అరికట్టిన అధికారులు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



నీరు వృథాగా పోకుండా చేస్తున్న అధికారులు

రామడుగు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వృథాగా పోతున్న నల్లా నీటిని అధికారులు అరికట్టారు. 'తాగునీరు వృథా' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితం కాగా ఎంపీడీవో, గ్రామ ప్రత్యేక అధికారి రాజేశ్వరి స్పందించారు. వెంటనే వృథాగా పోతున్న నీటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. తాగునీరు వృథా కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

యువత డ్రగ్స్‌కు బానిస కావద్దు

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్

జమ్మికుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు బానిస కావద్దని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేష్ అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటి డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ఓదెలు కుమార్, యాంటీ డ్రగ్స్ కమిటీ కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఈ రవి, ఎల్ రవీందర్ ఉన్నారు.

ఆరేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలి

శంకరపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సీడీపీవో శ్రీమతి అన్నారు. మంగళవారం శంకరపట్నం మండలంలోని ఎరడపల్లి, గద్దపాక గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుణ, పద్మ ఉన్నారు.

గుడులు కాదు.. బడులకు ప్రాధాన్యం ఇవ్వండి : విమలక్క

చిగురుమామిడి, ఏప్రిల్ 15: గుడులు కాదు.. బడులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉమ్మడి రాష్ట్రాల అరుణోదయ సాంస్కృతిక కన్వీనర్ విమలక్క అన్నారు. మండలంలో సోమవారం రాత్రి ఉల్లంపల్లిలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో మాట్లాడారు. అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు జేరిపోతుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

తిమ్మాపూర్, ఏప్రిల్ 15, (ఆంధ్రజ్యోతి): డప్పు చాటింపుతో నైనా ప్రభుత్వం మేల్కొని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవా రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ధాన్యం కల్లాల దగ్గర రాష్ట్ర ప్రభుత్వాన్ని మేల్కొల్పే డప్పు చాటింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్, సీపీఎం పార్టీ మండల కార్యదర్శి మాతంగి శంకర్, నాయకులు మాతంగి వెంకట స్వామి, వేనంక కుమార్ పాల్గొన్నారు.

మానకొండూర్‌లో అగ్నిమాపక వారోత్సవాలు

మానకొండూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక అధికారి భూదయ్య ఆధ్వర్యంలో మంగళవారం మానకొండూర్‌లో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పోలీసులను ఆశ్రయించిన మాజీ ప్రజాప్రతినిధి

శంకరపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ ఆసరి అయిలయ్య తన కొడుకు, కోడలు అన్నం పెట్టడం లేదని మంగళవారం కేశవపట్నం పోలీసులను ఆశ్రయించాడు. అయిలయ్య భార్య సారమ్మ, చిన్న కొడుకు గణపతిలు మృతి చెందగా పెద్ద కొడుకు సదయ్య, కోడలు ఇంట్లోంచి గెంటేసారని ఫిర్యాదు చేశాడు.

గద్దపాకలో వైద్య శిబిరం

శంకరపట్నం, ఏప్రిల్15(ఆంధ్ర జ్యోతి): శంకరపట్నం మండలంలోని గద్దపాకలో కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

సైదాపూర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని అన్ని గ్రామాలలో బుధవారం నుంచి పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ విజేందర్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలి

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బతో కార్మికులు అప్రమత్తంగా ఉండాలని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికులకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ అరుణ, ఏఎన్ఎం రజిత పాల్గొన్నారు.

ఇందుర్తి సీపీఐ కార్యదర్శిగా ఉస్మాన్

చిగురుమామిడి,ఏప్రిల్ 15: మండలంలోని ఇందుర్తి గ్రామ సీపీఐ కార్యదర్శిగా ఎండీ ఉస్మాన్ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శిగా బందెల శ్రీనివాస్, అందె సంపత్, కోశాధికారిగా బింగి స్వామితో పాటు 12 మంది కార్యవర్గ సభ్యులను మంగళవారం ఎన్నుకున్నట్లు మండల సీపీఐ కార్యదర్శి నాగెల్లి లక్ష్మరెడ్డి తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

రామడుగు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గుండిలో పొన్నం శ్రీనివాస్ స్మారక చలివేంద్రాన్ని స్థానిక ఎస్సై రాజు మంగళవారం ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ గుండి ప్రవీణ్, మేడి శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

వీణవంక, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పరిపాటి రవీందర్ రెడ్డిని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. రవీందర్ రెడి కూతురు హర్షిత ఇటీవల అమెరికాలో అనారోగ్యంతో మృతి చెందింది.